
సాక్షి చిత్తూరు
శుక్రవారం । 12 । జూలై । 2024



సీజ్ చేసిన మద్యం ధ్వంసం

వివిధ కేసుల్లో పట్టుబడిన మద్యాన్ని చిత్తూరు, పలమనేరు పోలీసులు జేసీబీలతో ధ్వంసం చేయించారు. - 8లో



అదుపు తప్పి బొలేరో బోల్తా

టమాటాలను తరలిస్తున్న బొలేరో వాహనం వెనుక చక్రం ఊడిపోవడంతో అదుపు తప్పి బోల్తా పడింది. - 8లో



దూసుకొచ్చిన మృత్యువు

మృత్యువు దూసుకొచ్చింది. వలస కార్మికుల బతుకులను ఛిద్రం చేసింది. ముగ్గురి ప్రాణాలను గాల్లో కలిపేసింది. - 8లో

న్యూస్‌రీల్

మోటారు వాహన చట్టంపై అవగాహన



మాట్లాడుతున్న జిల్లా జడ్జి భీమారావు

చిత్తూరు అర్బన్: ప్రతిఒక్కరూ రహదారి భద్రతా నియమాలు, మోటారు వాహన చట్ట నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు అన్నారు. గురువారం చిత్తూరులోని జిల్లా న్యాయస్థానాల సముదాయంలో మోటారు వాహన చట్టంపై రవాణాశాఖ, పోలీసు శాఖ అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జడ్జి మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో కొందరు ప్రాణాలు కోల్పోతుంటే, మరికొందరు శాశ్వత అంగవైకల్యానికి గురవుతుండడం ఆందోళనను కలిగిస్తోందన్నారు. దీన్ని నివారించడానికే రాష్ట్ర హైకోర్టు సైతం హెల్మెట్‌ను తప్పనిసరి చేసిందన్నారు. హెల్మెట్ పెట్టుకోకపోతే జరిగే అనర్థాలను పోలీసులు, రవాణాశాఖ అధికారులు ప్రజలకు వివరించి చైతన్యం తీసుకురావాలన్నారు. అప్పుడే ప్రజల ప్రాణాలను కాపాడడం సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి వెన్నెల, చిత్తూరు ప్రాంతీయ రవాణాశాఖ అధికారి సునీల్‌కుమార్, ట్రాఫిక్ సీఐ నిత్యబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగాలకు దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి పద్మజ కోరారు. ఈ మేరకు గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రముఖ అగ్నివీర్ పథకంలో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఇంటర్‌లో ఇంగ్లిష్, ఫిజిక్స్, గణితంలో 50 శాతం మార్కులు, మూడేళ్ల ఇంజినీరింగ్ డిప్లొమా, తత్సమాన విద్యార్హత ఉండాలన్నారు. అవివాహిత యువతీ, యువకులు అర్హులన్నారు. ఎంపిక ప్రక్రియ మూడు అంచెల్లో ఉంటుందన్నారు. ఆన్‌లైన్‌లో రాత పరీక్ష, ఫిజికల్ ఫిట్‌నెస్, మెడికల్ ఫిట్‌నెస్ పరీక్షలతో పాటు ధ్రువీకరణపత్రాల పరిశీలన ఉంటుందని తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు www.agnipathvayyu.cdac.in వెబ్‌సైట్‌లో ఈ నెల 28వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

ఎయిర్‌పోర్ట్ భూముల పరిశీలన




సేకరించిన భూముల వివరాలను తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్

శాంతిపురం: కుప్పం ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ఎంపిక చేసిన భూములను జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గురువారం పరిశీలించారు. శాంతిపురం, రామకుప్పం మండలాల సరిహద్దుల్లోని అమ్మావారిపేట, కిలాకిపోడు రెవెన్యూ గ్రామాల పరిధిలోని భూములను విమానాశ్రయం కోసం అధికారులు ఎంపిక చేశారు. ఆ ప్రాంతాన్ని సందర్శించిన కలెక్టర్ అధికారులను అడిగి వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ హరికుమార్, నాయకులు పీఎస్ మునిరత్నం, డాక్టర్ సురేష్ పాల్గొన్నారు.

14న 'గ్రీన్ వే లైఫ్'పై పోస్టర్ పెయింటింగ్ పోటీలు

తిరుపతి(అలిపిరి): తిరుపతిలోని ప్రాంతీయ విజ్ఞాన కేంద్రంలో రీజనల్ సైన్స్ సెంటర్, వే ఫౌండేషన్ సంయుక్తంగా 'గ్రీన్ వే లైఫ్' కార్యక్రమంపై ఈనెల 14న ఆదివారం ఉదయం 10.30 గంటలకు 1 నుంచి పదో తరగతి విద్యార్థులకు పోస్టర్ పెయింటింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు ప్రాంతీయ విజ్ఞాన కేంద్రం కో–ఆర్డినేటర్ శ్రీనివాస నెహ్రూ తెలిపారు. ఒక సంవత్సరం కాలంలో లక్ష మొక్కల పెంపకం చేపట్టాలన్న లక్ష్యంతో పోటీలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. 'ఒక మొక్కను నాటండి.. అదే ప్రాణాలను కాపాడుతుంది' అనే అంశంపై పోటీలు ఉంటాయన్నారు. పోటీకి సంబంధించిన పోస్టరు కేంద్రం నుంచి అందజేస్తామని.. పాల్గొనేవారు అన్ని పెయింటింగ్ వస్తువులు వెంట తెచ్చుకోవాలని తెలిపారు. 1–4 తరగతులు, 5– 7 తరగతులు, 8–10 తరగతులకు వేర్వేరు విభాగాల్లో పోటీలు ఉంటాయని.. విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు.



'నా ఆడ బిడ్డల కోసం నేను హామీ ఇస్తున్నా. తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తా. ఎంత మంది పిల్లలుంటే అంతమందికి ఏడాదికి రూ.15,000 ఇచ్చే కార్యక్రమాన్ని నేను తీసుకుంటా. ఒకప్పుడు ఒకరితో.. ఇద్దరితో సరిపెట్టుకోమన్నా. కానీ ఇప్పుడుచెబుతున్నా మీకు ఓపికుంటే ముగ్గురునలుగురు పిల్లలు కన్నా పర్వాలేదు. ఎందుకంటే జనాభా తగ్గిపోతా ఉంది. రాబోయే రోజుల్లో పిల్లలే మన ఆస్తి. ఆ పిల్లలను బాగా చదివిస్తే ప్రపంచాన్ని శాసించే శక్తి ఆ పిల్లలకు వస్తుంది. అందుకే అమ్మకు వందనం అనే పథకాన్ని తీసుకొస్తున్నా..' అంటూ చిత్తూరు జిల్లా, పూతలపట్టులో జరిగిన ఎన్నికల బహిరంగ సభలో చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు.



తల్లికి చెబుదాం.. ఒక్కరికే వందనం!

కానీ ఇప్పుడు అధికారంలోకి వచ్చాక హామీలను తుంగలో తొక్కేరీతిలో కుయుక్తులు పన్నుతున్నారు. పిల్లలందరికీ కాదు.. కుటుంబంలో ఒక్కరికి మాత్రమే తల్లికి వందనమంటూ కొత్త రాగం అందుకున్నారు. దీనిపై తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

- అప్పుడే మొదలుపెట్టిన చంద్రబాబు మార్క్ పాలి'ట్రిక్స్'
- మేనిఫెస్టోలో చెప్పినట్లు కాకుండా తల్లికి వందనం పథకానికి తూట్లు పొడుస్తూ ఉత్తర్వులు
- కసరత్తు పేరిట కాలయాపన
- గతంలో స్కూళ్లు తెరిచిన వెంటనే అమ్మఒడి అందించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వంలో పథకాలకు మంగళం పాడే యత్నం
- ఫీజులు చెల్లించేందుకు తల్లిదండ్రులు అప్పులు చేయాల్సిన దుస్థితి

చిత్తూరు జిల్లా అన్ని యాజమాన్యాల విద్యాసంస్థల వివరాలు..

జిల్లాలోని ప్రాథమిక పాఠశాలలు	2089
ప్రాథమికోన్నత పాఠశాలలు	261
ఉన్నత పాఠశాలలు	524
జూనియర్ కళాశాలలు	146
1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు	2,33,925
ఇంటర్ చదువుతున్న విద్యార్థులు	14,408

చిత్తూరు కలెక్టరేట్: రాష్ట్రప్రభుత్వం తల్లికి వందనం పథకం అమలుపై అప్పుడే పిల్లిమొగ్గలు వేస్తోంది. ఒక కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి రూ.15 వేలు చొప్పున ఇస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు, ఆయన తనయుడు లోకేష్, ఇతర నాయకులంతా కూడా హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత పథకం అమలుకు షరతులు షురూ అంటూ తాజాగా జీఓ నెం.29లో తల్లికి రూ.15 వేలు మాత్రమేనంటూ మెలిక పెట్టారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు గందరగోళానికి గురవుతున్నారు. అధికారంలోకి వచ్చాక ఇలాంటి మెలికలు పెట్టడం సరికాదని తల్లిదండ్రులు విమర్శలు గుప్పిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 2,874 అన్ని యాజమాన్యాల పాఠ శాలలు ఉన్నాయి. ఇందులో ప్రాథమిక పాఠశాలలు 2089, ప్రాథమికోన్నత పాఠశాలలు 261, ఉన్నత పాఠశాలలు 524 ఉన్నాయి. ఈ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు 2,33,925 మంది విద్యను అభ్యసిస్తున్నారు. అలాగే జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 31, ప్రైవేట్ కాలేజీలు 115 ఉన్నాయి. ఇందులో 14,408 మంది విద్యార్థులు ఇంటర్మీడియెట్ చదువుతున్నారు.

ప్లేట్ ఫిరాయింపు..

తల్లికి వందనం పథకం అమలులో టీడీపీ సర్కారు అప్పుడే ప్లేట్ ఫిరాయించింది. సర్కారు, ఇతర యాజమాన్య పాఠశాలల్లో, జూనియర్ కళాశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు మేలు చేయాలనే ఉద్దేశంతో వైఎస్సార్‌సీపీ సర్కారు అమ్మఒడి పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇచ్చిన మాట ప్రకారం 2019లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 2024 ఎన్నికలకు ముందు వరకు క్రమం తప్పకుండా అమ్మఒడి పథకాన్ని అమలు చేశారు. ఏటా స్కూళ్ల ప్రారంభం కాగానే అమ్మఒడి పథకాన్ని అమలు చేసి నేరుగా తల్లుల ఖాతాల్లోకి నగదు జమచేశారు. అదే అమ్మఒడి పథకం పేరును తల్లికి వందనంగా మార్చేసి గత ఎన్నికల సమయంలో టీడీపీ ప్రధాన ప్రచార అస్త్రంగా వాడుకుంది. ఎన్నికల ప్రచారంలో ఒక కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం ఇస్తామని హామీ ఇవ్వడంతో పాటు టీడీపీ మేనిఫెస్టోలో స్పష్టంగా తెలిపారు. అయితే తాజాగా ఈ నెల 10వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం అమలుపై జీఓ 29ని జారీచేసింది. ఆ జీఓలో తల్లికి వందనం డిస్క్రిప్షన్‌లో ఈచ్ స్టూడెంట్ అని ఇవ్వాల్సింది పోయి ఈచ్ మదర్ అని పేర్కొన్నారు. దీంతో ఎన్నికల సమయంలో ఒక కుటుంబంలోని ఎంతమంది విద్యార్థులు ఉంటే అంతమందికి రూ.15 వేలు చొప్పున ఇస్తామన్న టీడీపీ సర్కారు మాట మార్చి తల్లిదండ్రులను ఏమార్చి మోసం చేసింది.

కసరత్తు పేరిట కాలయాపన..!

విద్యాసంస్థలు ప్రారంభమై నెల రోజులు కావొస్తోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం పథకం కింద నగదు ఇస్తే పిల్లల ఫీజులు చెల్లిద్దామని చాలామంది తల్లిదండ్రులు ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల్లో విద్యార్థులను ఫీజులు చెల్లించాలని యాజమాన్యాలు ఒత్తిడి పెడుతున్నారని తల్లిదండ్రులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో తాజాగా జారీచేసిన తల్లికి వందనం పథకం జీఓ తప్పులతడకగా ఉండడం, అమలుకు మరిన్ని నెలలు సమయం ఉండడంతో తల్లిదండ్రులు ఇబ్బందులు పడాల్సి ఉంటుంది. దీంతో వారు పిల్లల ఫీజుల చెల్లింపునకు అప్పులు చేయాల్సిన దుస్థితి కనిపిస్తోంది.

నిబంధనలు ఎక్కువే..!

పథకం లబ్ధిదారులను ఎలాగైనా కుదించాలనే ఉద్దేశంతో ప్రస్తుతం జారీచేసిన జీఓలో నిబంధనలు పెట్టా రు. గత ప్రభుత్వం అమ్మఒడి పథకాన్ని చిత్తూరు జిల్లాలో ఒకటి నుంచి ఇంటర్ వరకు చదివే 2,33,925 మంది విద్యార్థులకు గాను 1,52,542 మంది తల్లుల ఖాతాల్లో ఏటా రూ.228.8 కోట్లను వైఎస్సార్‌సీపీ సర్కారు జమచేసేది. ప్రస్తుతం టీడీపీ సర్కారు 10 రకాల నిబంధనలను తల్లికి వందనం పథకానికి విధించింది. ఆ నిబంధనలన్నీ లబ్ధిదారుల వడపోతకేనని విద్యావేత్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జీఓ 29పై సర్వత్రా విమర్శలు..

రాష్ట్రప్రభుత్వం జారీచేసిన జీఓ 29లో ఒక కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం ఇస్తామనే స్పష్టమైన అంశం స్పష్టంగా లేదు. పైగా ఈచ్ మదర్ అనే పదం అనేక అనుమానాలకు తావిస్తోంది. అదేవిధంగా తల్లికి వందనం పథకాన్ని వెంటనే అమలు చేయకుండా జాప్యం కోసం అనేక నిబంధనలను తెరపైకి తీసుకొచ్చారు. గతంలో అమ్మఒడి పథకం అమలులో ప్రస్తుతం పేర్కొన్న నిబంధనలు ఏవీ లేవని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

ఎంతమంది ఉన్నా ఇస్తామని..



"ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉన్నా అందరికీ తల్లికి వందనం కింద రూ.15 వేల చొప్పున ఇస్తామన్నారు. పాఠశాల ప్రారంభమై 30 రోజులు గడుస్తున్నా ఇంతవరకు ఇవ్వలేదు. అసలే పేదరికంతో కూలీ పనులకు వెళ్లి జీవనం సాగిస్తున్నాం. సీఎం చంద్రబాబును నమ్మి ఇద్దరు పిల్లలను బడికి పంపుతున్నాం. తల్లికి వందనం పథకం వస్తుందా ? లేదా ? గత ప్రభుత్వం వెంటనే జమ చేసేది.

– నదియా, శ్రీకావేరిరాజపురం దళితవాడ, పాలసముద్రం మండలం

అందరికీ ఇవ్వాలి..



తల్లికి వందనం పథకాన్ని అందరికీ వర్తింపజేయాలి. ఒక తల్లికి ఎంతమంది బిడ్డలు ఉంటే అందరికీ నగదును అందజేయాలి. బడికి ఎంతమంది పిల్లలు వెళ్లినా ఒక్కొక్కరికీ రూ.15 చొప్పున అందరికీ డబ్బులు ఇస్తామని కూటమి తరపున చంద్రబాబు నాయుడు మాట ఇచ్చారు. ఇప్పుడు ఒక తల్లికి ఇస్తామని చెప్పుకుంటున్నారు. నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రైవేటు స్కూల్‌లో చదువుతున్నారు. స్కూళ్లు తెరిచి నెలరోజు అవతా ఉంది. పాఠశాల యాజమాన్యం డబ్బులు కట్టమని అప్పుడే ఒత్తిడి చేస్తున్నారు. వెంటనే తల్లికి వందనం అమలు చేసి ఎంతమంది బిడ్డలు ఉన్నారో అందరికీ అమలు చేయాలి.

– బిల్లెమ్మ, నంగమంగళం, గుడిపాల

ఎప్పుడు ఇస్తారు?



ప్రస్తుతం జరిగిన శాసనసభ ఎన్నికల్లో సీఎం చంద్రబాబు నాయుడు తల్లికి వందనం పథకం కింద ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అందరికీ వర్తిస్తుందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీపై నమ్మకంతో నేను మా పిల్లలను ప్రైవేటు పాఠశాలలో చేర్పించా. చంద్రబాబు నాయుడు సీఎం అయ్యి 30 రోజులు గడుస్తున్నా తల్లికి వందనం పథకాన్ని అమలు చేయడంలో కాలాయాపన చేస్తున్నారు. గత ప్రభుత్వం పాఠశాల ప్రారంభం నాటికే అమ్మఒడి పథకాన్ని మా ఖాతాల్లో జమ చేసింది.

– భువన, కనికాపురం బీసీ కాలనీ, పాలసముద్రం మండలం

కాలయాపన ఎందుకు ?



సూపర్‌సిక్స్‌లో భాగంగా తల్లికి వందనం పథకం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉన్నా ఒక్కొక్కరికీ తల్లుల ఖాతాల్లో రూ.15 వేలు జమ చేస్తామని సీఎం చంద్రబాబు నాయుడు చెప్పారు. ఈ పథకం అమలుపై కాలాయాపన చేయడం వల్ల పాఠశాల యాజమాన్యం ఫీజు కట్టమని మాపై ఒత్తిడి చేస్తున్నారు. సీఎం మాటలను నమ్మి ఇద్దరి పిల్లలను ప్రైవేటు పాఠశాలకు పంపుతున్నా. తల్లికి వందనం నగదు రాకపోవడంతో బంగారు ఆభరణాలు కుదవ పెట్టి యూనిఫాం, ఫీజులు చెల్లించా.

– దివ్య, కొల్లాగుంట, కార్వేటినగరం. మండలం

సెక్యూరిటీ గార్డు ఉద్యోగాలకు దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : తిరుపతి జిల్లాలోని ఎస్‌బీఐ బ్యాంకుల్లో సెక్యూరిటీ గార్డుల ఉద్యోగాలకు అర్హత, ఆసక్తి ఉన్న మాజీ సైనికులు దరఖాస్తులు చేసుకోవాలని ఉమ్మడి జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి విజయశంకర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. ఎస్‌బీఐ బ్యాంకులలో ఖాళీగా ఉన్న సెక్యూరిటీ గార్డుల ఉద్యోగాలకు మాజీ సైనికులు అర్హులన్నారు. కాల పరిమితి ఒక సంవత్సరం ఉంటుందని తెలిపారు. 40 సంవత్సరాల నుంచి 50 సంవత్సరాల మధ్య గల మాజీ సైనికులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. జీతం దాదాపు రూ.26 వేల వరకు ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న మాజీ సైనికులు దరఖాస్తులను చిత్తూరు జిల్లా కేంద్రంలోని సైనిక సంక్షేమ శాఖ కార్యాలయంలో ఈ నెల 16 వ తేదీలోపు అందజేయాలని కోరారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 73,353 మంది స్వామివారిని దర్శించుకోగా 28,444 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.05 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి



విద్యార్థులకు విద్యాసామగ్రిని అందిస్తున్న డీఈఓ దేవరాజు

కార్వేటినగరం: పదోతరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి 2024–25 విద్యా సంవత్సరంలో ఉత్తమ మార్కులు సాధించే విధంగా బోధనలు చేపట్టాలని జిల్లా విద్యాశాఖ అధికారి దేవరాజులు సూచించారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల ప్లస్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులకు విద్యాబోధనలు చేయాలని ఆదేశించారు. పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పెంచేందుకు ఇప్పటి నుంచే ప్రణాళిక సిద్ధం చేసుకుని సిలబస్‌ను పూర్తి చేసి, డిసెంబర్ నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహించి పాఠ్యాంశాలపై రివ్యూ చేయించాలన్నారు. వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాగే పదో తరగతి విద్యార్థులతో పాటు, ఇంటర్మీడియెట్ విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి విద్యాబోధన గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఆయన వెంట హెచ్ఎం గాయత్రీదేవీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

సాంకేతిక వ్యవసాయంతో అధిక దిగుబడులు



డ్రోన్ ద్వారా మందుల పిచికారీ విధానాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్



విత్తనాల రోలర్‌ను పరిశీలిస్తూ..

- జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

పుత్తూరు: సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకుని వ్యవసాయం చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ రైతులకు సూచించారు. గురువారం కలెక్టర్ వడమాలపేట మండలం కదిరిమంగళం గ్రామంలోని పంట పొలాలను పరిశీలించారు. డ్రోన్ ద్వారా పురుగు మందుల పిచికారీ చేసే విధానాన్ని, డ్రమ్ సీడర్ పద్ధతిలో సాగుచేసిన వరి పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నూతన సాంకేతిక పద్ధతులపై రైతులతో మాట్లాడి వారి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విత్తనాలు చల్లే రోలర్, నీటిని వెదజల్లే డ్రిప్ స్ప్రింక్లర్లు వంటి నూతన యాంత్రీకరణ విధానాలను పాటించడం ద్వారా ఖర్చులను గణనీయంగా తగ్గించుకోవచ్చని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానంతో చేసే వ్యవసాయానికి ప్రభుత్వపరంగా తాను పూర్తిస్థాయిలో సహకరిస్తానని స్పష్టం చేశారు. రాస్ కృషి విజ్ఞాన కేంద్రం వారు కదిరిమంగళం గ్రామంలో పైలట్ ప్రాజెక్టుగా డ్రోన్ ద్వారా పురుగుమందులను పిచికారీ చేసే విధానాన్ని పరిశీలించి అభినందించారు. కౌలు రైతులకు కౌలు రైతుకార్డు, పచ్చిరొట్ట విత్తనాలు, జీలుగ అందజేశారు. రైతులకు ఫిజికల్ వెరిఫికేషన్ రికార్డులను ఫేషియల్ యాప్ ద్వారా రికార్డు చేసి వారికి పీఎం కిసాన్ నిధులు పొందడానికి అప్రూవ్ చేశారు. అనంతరం పాదిరేడు గ్రామంలో హార్టికల్చరల్ ద్వారా అందజేసిన పామాయిల్ మొక్కల పెంపకాన్ని పరిశీలించారు. ఆయిల్‌పామ్ మన జిల్లాకు ఒక వరమని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏపీఎంఐపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా ఇచ్చిన మైక్రో స్ప్రింక్లర్స్‌తో సాగు చేసిన వేరుశనగ పంటను పరిశీలించారు. స్ప్రింక్లర్లు వినియోగించడం ద్వారా రైతులు ఖర్చులను తగ్గించుకోవచ్చునని సూచించారు.

వారంలో శ్మశాన స్థలం కేటాయించాలి..

పాదిరేడు గ్రామస్తులు శ్మశాన స్థల సమస్యను కలెక్టర్ వెంకటేశ్వర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన వారంలోపు స్థలాన్ని గుర్తించి కేటాయించాలని తహసీల్దార్ రాజనరసింహాను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాదరావు, జిల్లా ఉద్యాన అధికారి దశరథరామిరెడ్డి, జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి సతీష్, పుత్తూరు ఏడీఏ రమేష్‌రాజు, రాస్ కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాసులు, ఎక్స్‌టెన్షన్ అధికారి రామ్‌కుమార్, ఏఓ విజయ్‌కుమార్, ఎంపీడీఓ సుజాత, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భార్య పుట్టింటికి వెళ్లిందని..

– భర్త ఆత్మహత్య



ఉదయ్‌కిరణ్ (ఫైల్)

పలమనేరు: ఆషాఢమాసంలో భార్య పుట్టింటికి వెళ్లడంతో జీవితంపై విరక్తి చెంది ఓ భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాలు.. టి.వడ్దూరు గ్రామానికి చెందిన శంకర్ కుమారుడు ఉదయ్‌కిరణ్(22)కు ఆర్నెళ్ల కిందట పెళ్లి అయింది. ఇటీవల ఉదయ్‌కిరణ్ భార్య పుట్టింటికి వెళ్లింది. ఇటీవల పిలిచినా రాలేదని కలత చెందిన అతను పెంగరగుంట సమీపంలోని అడవిలో నాలుగురోజుల కిందట చెట్టుకు ఉరేసుకున్నాడు. అడవిలో కుళ్లిన వాసన రావడంతో పశువుల కాపరులు ఈ విషయాన్ని గమనించారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించిన స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

సీజ్ చేసిన మద్యం ధ్వంసం



సీజ్‌చేసిన మద్యాన్ని ధ్వంసం చేస్తున్న దృశ్యం

చిత్తూరు అర్బన్: పోలీసుల దాడుల్లో పట్టుబడిన నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ (ఎన్‌డీపీఎల్) మద్యాన్ని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు ధ్వంసం చేశారు. గురువారం రెడ్డిగుంట ప్రదేశంలో 1341 లీటర్ల పరిమాణం ఉన్న మద్యం బాటిళ్లను పోలీసులు రోడ్డు రోలరుతో తొక్కించారు. దాదాపు 30 కేసుల్లో పట్టుబడిన రూ.1.20 లక్షల విలువైన మద్యాన్ని ఎస్పీ ఆదేశాలతో ధ్వంసం చేసినట్లు పోలీసులు తెలిపారు.

పలమనేరులో..

పలమనేరు: గత ఏడాది వివిధ కేసుల్లో పట్టుబడిన మద్యాన్ని పలమనేరు పట్టణంలోని కంపోస్ట్ యార్డు వద్ద స్థానిక పోలీసులు, సెబ్ అధికారులు గురువారం ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా సెబ్ సూపరింటెంటెంట్ శ్రీధర్‌రావు మాట్లాడుతూ సెబ్ పరిధిలో 66 కేసుల్లో పట్టుబడిన 190 లీటర్ల మద్యం, స్థానిక పోలీస్‌స్టేషన్లలో 82 కేసుల్లో పట్టుబడిన 2770 లీటర్ల మద్యం బాటిళ్లను జేసీబీతో తొక్కించి ధ్వంసం చేసినట్లు తెలిపారు. మద్యం విలువ సుమారు రూ.20 లక్షల దాకా ఉంటుందన్నారు. స్థానిక సీఐ చంద్రశేఖర్, సెబ్ సీఐ సురేష్, ఎస్‌ఐ దత్తాత్రేయలు పాల్గొన్నారు.

అంతుచిక్కని రోగాలు..

అడ్రస్ లేని ఆస్పత్రులు

ప్రస్తుతం సమాజంలో అంతుచిక్కని వ్యాధులు సోకుతున్నాయి. తినే ఆహారం కల్తీ.. తాగే నీరు కలుషితం..ఆఖరికి పండ్లు, కూరగాయలను కూడా రసాయనాలతో కలుషితం చేస్తున్న పరిస్థితి నెలకొంది. దీంతో చెప్పడానికి కూడా పేరు లేని రోగాలు వ్యాపిస్తున్నాయి. ఏదైనా చిన్న జబ్బు చేస్తే వేసుకునే మందుబిళ్ల అయినా మంచిదా అంటే ఆలోచించాల్సిన పరిస్థితి దాపురించింది. ఈ నేపథ్యంలో జనాల అవసరాలను గుర్తెరిగి వీధికో క్లినిక్, సందుకో ల్యాబ్ వెలుస్తున్నాయి. అనుమతుల్లేని వీరు ప్రజలకు వైద్యం చేస్తూ వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. దీంతో వీరిపై కొరడా ఝులిపించేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సిద్ధమయ్యారు.

- అనధికారికంగా పుట్టుకొస్తున్న ఆస్పత్రులు, ల్యాబ్‌లు
- అనుమతులు లేకుండానే నిర్వహణ
- గుట్టుచప్పుడు కాకుండా వైద్యసేవలు, పరీక్షలు
- ప్రజల ప్రాణాలతో చెలగాటం
- అధికారులకు ఫిర్యాదుల వెల్లువ
- తనిఖీలకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సిద్ధం



జిల్లా వైద్య ఆరోగ్యంశాఖ

కాణిపాకం: మేజర్ పంచాయతీల నుంచి పెద్ద పట్టణాల వరకు వాడవాడలా పుట్టగొడుగుల్లా ఆస్పత్రులు, ల్యాబ్‌లు వెలుస్తున్నాయి. ఆస్పత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్‌లు నిర్వహణకు వైద్యారోగ్య శాఖ వద్ద కొంతమంది అనుమతి తీసుకోగా, మరి కొంత మంది ఎటువంటి అనుమతులు లేకుండానే నిర్వహించేస్తున్నారు. అనుమతులు లేని వాటిపై వైద్యారోగ్య శాఖ అధికారులు దాడులు చేసి చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ వైద్యాధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎవరైనా ఆస్పత్రి కానీ, ల్యాబ్ కానీ, స్కానింగ్ సెంటర్ కానీ నిర్వా హించాలనుకుంటే వైద్య ఆరోగ్యశాఖ వద్ద మొదట రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. రిజిస్ట్రేషన్ లేకుండా ఎట్టి పరిస్థితుల్లో కూడా వాటిని నిర్వహించకూడదు. అయితే కొందరు ఇష్టానుసారంగా క్లినిక్‌లు, స్కాన్ సెంటర్లు, డయాగ్నొస్టిక్ సెంటర్లను రిజిస్ట్రేషన్ లేకుండానే ఏర్పాటు చేసుకుంటున్నారు. అయితే జిల్లాలో వైద్యారోగ్యశాఖ వద్ద 125 ఆస్పత్రులు రిజిస్టర్ అయ్యాయి. ఇందులో బేసిక్ ల్యాబ్‌లు 19, క్లినిక్‌లు 20, డెంటల్ క్లినిక్‌లు 13, హాస్పిటల్స్ 73 ఉన్నాయి. అదేవిధంగా ప్రభుత్వం తరపున స్కానింగ్ సెంటర్లు 20, ప్రైవేటు 57 స్కానింగ్ సెంటర్లు మొత్తం 77 రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు.

అనుమతులు లేకుండానే..

జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ అనుమతి లేకుండానే కొంతమంది కినిక్‌లు, ల్యాబ్‌లు గుట్టుగా నిర్వహిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ఆస్పత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్‌ల్లో రోగులకు ఏదైనా ప్రమాదం జరిగితే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. అదే రిజిస్ట్రేషన్ చేయించుకుంటే రోగులకు ప్రమాద బీమా వర్తిస్తుంది. అనుమతి లేకుండా నిర్వహిస్తున్న వాటిపై వైద్యారోగ్యశాఖ అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై ఫిర్యాదులు రావడంతో అధికారులు తనిఖీలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు.

ఐదేళ్లకోసారి రెన్యువల్ తప్పనిసరి..

ఆస్పత్రులు గానీ, ల్యాబ్‌లు గానీ, స్కానింగ్ సెంటర్లు గానీ 5 ఏళ్లకు ఒకసారి రెన్యువల్ చేసుకోవాలి. ఒకసారి రిజిస్ట్రేషన్ చేసుకుంటే దాని కాలపరిమితి 5 ఏళ్ల వరకు ఉంటుంది. ఆ తర్వాత రెన్యువల్ చేయించుకోవాలి. కానీ చాలామంది రెన్యువల్ చేసుకోకుండానే నిర్వహిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

ఫీజుల వివరాలు..

సోలో క్లినిక్ రూ.1250, పాలిక్లినిక్‌లు రూ.2500, 20 పడకల ఉన్న ఆస్పత్రి అయితే రూ.3750, 21 నుంచి 50 పడకల ఆస్పత్రి రూ.7500, 50 నుంచి 100 పడకల ఆస్పత్రి అయితే రూ.10 వేలు, 21 నుంచి 100 పడకలు అయితే రూ.10 వేలు, 101 నుంచి 200 పడకలకు అయితే రూ.15000, 200కు పైగా పడకలు ఉన్న ఆస్పత్రికి రూ.37,500, ల్యాబొరేటరీకి రూ.2500, డయాగ్నోస్టిక్ సెంటర్, ఎక్స్‌రే, సిటి స్కాన్ సెంటరు అయితే రూ.10,000, ఫిజియోథెరపి క్లినిక్‌కు రూ.3750 ఫీజు చెల్లించాలి.

అనుమతి లేకుంటే చర్యలు..



ఆస్పత్రి, క్లినిక్, ల్యాబ్ ఏదైనా నిర్వహించాలంటే వైద్యారోగ్య శాఖ వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఎక్కడైనా అనుమతులు లేకుండా ఆస్పత్రి ల్యాబ్‌లు నిర్వహిస్తున్నారని తెలియజేస్తే అటువంటి వాటిని సీజ్ చేస్తాం.

– ప్రభావతిదేవి, డీఎంఅండ్‌హెచ్‌ఓ, చిత్తూరు

రోడ్డు ప్రమాదంలో సర్పంచ్ మృతి



తులసీప్రసాద్ రెడ్డి(ఫైల్)

ఐరాల: మండలంలోని ఎర్రేపల్లె పంచాయతీ సర్పంచ్ తులసీప్రసాద్ రెడ్డి(49) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. తులసీప్రసాద్‌రెడ్డి బుధవారం రాత్రి చిత్తూరులో పని ముగించుకుని ఎర్రేపల్లెకు వస్తుండగా చిగరపల్లె సమీపంలోని ఒంటి ఇల్లు వద్ద ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నాడు. దీంతో తీవ్రంగా గాయాలు కావడంతో అక్కడే రక్తపు మడుగులో పడి ఉన్నాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం చీలాపల్లె సీఎంసీ ఆస్పత్రికి తరలించగా అప్పటికే తులసీప్రసాద్‌రెడ్డి మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. దీనిపై కాణిపాకం పోలీసులు కేసు నమోదు చేశారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. తులసీప్రసాద్‌రెడ్డి మృతదేహానికి పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

టమాటా రైతుల ఆందోళన

పలమనేరు: చుట్టుపక్కల ఉన్న మార్కెట్ల కంటే పలమనేరు మార్కెట్‌లో టమాటా ధరలు తక్కువగా ఉంటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం వారు మార్కెట్‌లోనే ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పక్కనే ఉన్న వడ్డిపల్లి, కోలారు, వీకోట మార్కెట్లలో బాక్సు ధర రూ.800 దాకా ఉంటే ఇక్కడ మాత్రం మండీ వ్యాపారులే రింగ్‌గా ఏర్పడి ధరలు తగ్గిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడి మండీ వ్యాపారులే బయటి వ్యాపారులను రానీయకుండా వాళ్లే తమ సరుకును కొని, వాళ్లే కమీషన్లు తీసుకుని రైతులను ఏమార్చుతున్నారని వాపోయారు. దీనిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి.. కరెంట్‌బిల్

చిత్తూరు కార్పొరేషన్: ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం వంటి మూడో పార్టీ యాప్స్ ద్వారా కరెంటు బిల్లుల చెల్లింపులను తాత్కాలికంగా ఆపివేశారని ఈఈ మునిచంద్ర గుర్తు చేశారు. గురువారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడారు. ప్రస్తుతం కరెంటు బిల్లును ఆన్‌లైన్‌లో చెల్లించాలని, గూగుల్‌లోకి వెళ్లి ఏపీఎస్పీడీసీఎల్ వెబ్‌సైట్‌లో వెళ్లి బిల్ డెస్క్‌లోని బిల్లింగ్ ఆప్షన్ ఎంచుకుని కట్టాలన్నారు. వీటిని సంస్థ మరింత సులభతరం చేసిందన్నారు. అందులో భాగంగా క్యూఆర్ కోడ్‌ను ఫోన్‌లోని గూగుల్ కెమెరా లేదా గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎంలో స్కాన్ చేయవచ్చన్నారు. అప్పుడు నేరుగా బిల్లింగ్ ఆప్షన్‌కు వెళ్తుందన్నారు. అక్కడ సర్వీసు నంబరు టైప్ చేసి డబ్బులు కట్టవచ్చన్నారు. డివిజన్ పరిధిలో మొత్తం 1.60 లక్షల సర్వీసులు ఉండగా ప్రతినెలా రూ.15 కోట్ల నుంచి రూ.18 కోట్లు కరెంటు బిల్లుల డిమాండ్ వస్తోందన్నారు. వాటిలో 60–70 శాతం ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు చేస్తున్నారని చెప్పారు. బిల్లు ఇచ్చిన 15 రోజులలోపు ఎటువంటి జరిమానా లేకుండా చెల్లించే అవకాశం కల్పించారన్నారు. ఈ నెలలో ప్రస్తుతం ఆన్‌లైన్ ద్వారా రూ.4.22 కోట్లు కలెక్షన్ అయిందన్నారు. డివిజన్ కార్యాలయంలో 2 కలెక్షన్ కౌంటర్లు, వినియోగదారుల కోసం ఒక అవగాహన కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు. ఏదైన సందేహం ఉంటే సిబ్బంది, ఈఆర్‌ఓ కౌంటర్ వద్ద తెలుసుకోవాలని వివరించారు.



క్యూఆర్ కోడ్

జీఓ 117ను రద్దు చేయాలి

చిత్తూరు కలెక్టరేట్: విద్యావ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్న జీఓ నెం.117ను వెంటనే రద్దు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపినాథ్ కోరారు. ఈ మేరకు గురువారం ఆ సంఘ నాయకులు డీఈఓ కార్యాలయం ఏడీ వెంకటేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రాథమికోన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లను నియమించాలన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో 5 తరగతులు కొనసాగించాలని కోరారు. టీచర్లకు యాప్‌ల భారం తగ్గించాలని, టేబుల్ సెట్ పాఠ్యపుస్తకాలను అందజేయాలని కోరారు. తల్లికి వందనం పథకం ప్రభుత్వ స్కూళ్లలోని విద్యార్థులకు మాత్రమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సర్వీసును డీఎస్సీల వారీగా క్రమబద్ధీకరించాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జగదీష్, అమర్‌నాథ్‌రెడ్డి, మధు, మునీర్ అహ్మద్ పాల్గొన్నారు.



ఏడీకి వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నేతలు

అదుపు తప్పి బొలేరో బోల్తా



బోల్తా పడిన వాహనంలో నుంచి టమాటాలను వేరు చేస్తున్న కూలీలు

చౌడేపల్లె: మండలంలోని ఆమినిగుంట సమీపంలో టమాటా బాక్సులతో వెళ్తున్న బొలేరో వాహనం అదుపుతప్పి బోల్తా పడిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా.. ఆమినిగుంట పంచాయతీ బూరగపల్లెకు చెందిన రైతు హనుమంతురెడ్డికి చెందిన టమాటాలను బాక్సుల్లో వేసి లోడ్ చేసుకుని బొలేరో వాహనంలో మార్కెట్‌కు వెళ్తుండగా ఆమినిగుంట సమీపంలో వాహనం వెనుక చక్రం ఊడిపోయింది. దీంతో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో టమాటా ధ్వంసం కాగా మిగిలిన కాయలను మరొక వాహనం ద్వారా మార్కెట్‌కు తరలించారు. ప్రమాదంలో డ్రైవర్‌తో పాటు మరో ఇద్దరికి స్వల్ప గాయాలైనట్లు సమాచారం.

రేషన్ బియ్యం లారీల సీజ్

సూళ్లూరుపేట/గూడూరు రూరల్: సూళ్లూరుపేట, తడ మండలాలు కేంద్రంగా నెల్లూరులోని పలు రైస్‌మిల్లులకు అక్రమంగా తరలిస్తున్న రెండు లారీలను రెవెన్యూ, పోలీస్ అధికారులు సీజ్ చేశారు. బుధవారం అర్ధరాత్రి తడ మండలం, కొండూరు నుంచి బయలుదేరిన తమిళనాడు రేషన్ బియ్యం లారీని స్థానిక తహసీల్దార్ గోపాలకృష్ణ వెంబడించి దొరవారిసత్రం మండలం, నెలబల్లికి సమీపంలో పట్టుకున్నారు. లారీకి ఉన్న పట్టవిప్పి చూడగా తమిళనాడుకు చెందిన రేషన్ బియ్యం సుమారు 30 టన్నుల దాకా ఉన్నట్టు గుర్తించారు. వాటికి సరైన బిల్లులు, ఆధారాలు లేకపోవడంతో లారీని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. అలాగే గురువారం ఉదయం 9.30 గంటల ప్రాంతంలో గూడూరు సమీపంలోని ఆదిశంకరా ఇంజినీరింగ్ కళాశాల వద్ద ఆంధ్ర రేషన్ బియ్యం లారీని గూడూరు రూరల్ సీఐ వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టుకున్నారు. ఈ రెండు లారీల ద్వారా బియ్యం అక్రమంగా వ్యాపారాలు చేస్తున్న వారు ఒకరికొకరు పోటీ పడి పోలీసులకు, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించి మరీ పట్టించారు. ఆంధ్ర రేషన్ బియ్యం సుమారు 35 టన్నుల దాకా ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. కొంతమంది అధికారపార్టీ నేతలు ఈ వ్యాపారాన్ని సిండికేట్ చేసి నెలవారీ మామూళ్లు భారీగా వసూలు చేస్తున్నారు. అలా మామూళ్లకు ఒప్పుకోకపోని వారిపై కక్షగట్టి ఇలా సమాచారం ఇచ్చి పోలీసులు, రెవెన్యూ అధికారులకు పట్టిస్తున్నట్టు తెలుస్తోంది. గురువారం పట్టుబడిన లారీని విడిపించుకునేందుకు వివిధ రకాలుగా రాజకీయ పైరవీలు చేసినప్పటికీ మీడియా జోక్యంతో అందరూ వెనక్కివెళ్లిపోయారు. పోలీసులకు కూడా తప్పనిసరి పరిస్థితుల్లో సీజ్ చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.



దొరవారిసత్రం మండలం వద్ద పట్టుబడిన తమిళనాడు రేషన్ బియ్యం లారీ

వైఎస్సార్‌సీపీ దళిత నాయకుడిపై దాడికి యత్నం



విచారిస్తున్న పోలీసులు



శేషాపురం ప్రధాన రహదారిపై గుమికూడిన టీడీపీ నేతలు

- ద్విచక్ర వాహనాన్ని లాక్కుని దాడికి పూనుకున్న టీడీపీ నేతలు
- అడ్డుకున్న శేషాపురం దళితవాడ గ్రామ ప్రజలు

చంద్రగిరి : బంధువుల ఇళ్లలో శుభకార్యానికి హాజరైన వైఎస్సార్‌సీపీ దళిత నాయకుడిపై టీడీపీ నేతలు దాడికి యత్నించిన ఘటన మండల పరిధిలోని శేషాపురం పంచాయతీలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. బాధితుడి వివరాల మేరకు.. శేషాపురం దళిత వాడకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వినోద్ తిరుపతిలో నివాసం ఉంటున్నారు. గురువారం సాయంత్రం శేషాపురం దళితవాడలోని తన బావమరిది ఇంట్లో శుభాకార్యానికి బయలుదేరాడు. విషయం తెలుసుకున్న పక్క గ్రామానికి చెందిన టీడీపీ నేతలు శేషాపురం దళితవాడకు చేరుకున్నారు. ద్విచక్ర వాహనంపై అటుగా వస్తున్న వినోద్‌ను అడ్డగించి బలవంతంగా ద్విచక్ర వాహనాన్ని లాక్కున్నారు. ఎందుకు వాహనాన్ని లాకున్నారంటూ ప్రశ్నించడంతో పరుష పదజాలంతో దూషణలకు దిగి, ఒక్కసారిగా ఆయుధాలతో దాడికి యత్నించారు. అప్రమత్తమైన వినోద్ కేకలు వేయడంతో దళితవాడ వాసులు, టీడీపీ నాయకులను అడ్డుకునేందుకు యత్నించారు. ఈ క్రమంలో టీడీపీ నాయకులు గ్రామంలోని పలువురిపై దాడికి పాల్పడ్డారు. గ్రామస్తులందరూ ఏకమవ్వడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ''వాడిని ఈరోజు చంపకుండా వదలం.. మా పార్టీకి వ్యతిరేకంగా ఎన్నికల్లో వాడు పనిచేశాడు'' అంటూ టీడీపీ నేతలు దూషణలకు దిగారు. దీంతో బాధితుడు చంద్రగిరి పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చి, దళిత నేతను క్షేమంగా గమ్యానికి చేర్చారు.

వలస కూలీలపైకి దూసుకొచ్చిన మృత్యువు

- కారు ఢీకొని ముగ్గురు యువకుల దుర్మరణం
- ఆ ముగ్గురూ ఒడిశా రాష్ట్రానికి చెందిన వలస కూలీలే



రోడ్డుపై చెల్లాచెదురుగా పడి ఉన్న మృతదేహాలు

బుచ్చినాయుడుకండ్రిగ: పొట్టచేతబట్టుకుని వలస వచ్చిన కూలీలపైకి మృత్యువు రూపంలో కారు దూసుకొచ్చింది. ముగ్గురు యువకుల ప్రాణాలను తీసింది. ఈ విషాద ఘటన మండలంలోని శ్రీకాళహస్తి–తడ రహదారి పార్లపల్లి గ్రామ సమీపంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు. మండలంలోని ఆలత్తూరు గ్రామంలో శ్రీనిధిరాజా పరిశ్రమలో ఒడిశా రాష్ట్రానికి బాపూన్ సింగ్ (22), రాజాసింగ్ (22), సుఖ్‌దేవ్‌సింగ్ (22) కూలీలుగా పనిచేస్తున్నారు. గురువారం వంట సరుకుల కొనుగోలు నిమిత్తం పరిశ్రమలో పనిచేస్తున్న ప్రొడక్షన్ మేనేజరు వినోద్ ద్విచక్ర వాహనాన్ని తీసుకుని శ్రీకాళహస్తికి వెళ్లారు. సరుకులు కొనుగోలు చేసుకుని పరిశ్రమకు వెళ్తుండగా పార్లపల్లి గ్రామ సమీపంలో బుచ్చినాయుడుకండ్రిగ నుంచి శ్రీకాళహస్తికి వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీ కొంది. దీంతో ద్విచక్ర వాహనంలో వెళ్తున్న ముగ్గురు యువకుల తలలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు పేర్కొన్నారు.

జనాభాతోపాటు ఆహారోత్పత్తులు పెరగాలి

తిరుపతి సిటీ: దేశంలో జనాభా పెరుగుదల ఎక్కువగా ఉందని అందుకు తగ్గట్టు ఆహారోత్పత్తుల నిల్వలు పెరగాలని సెట్విన్ సీఈఓ మురళీకృష్ణ అభిప్రాయపడ్డారు. గురువారం ఎస్వీయూ పాపులేషన్ స్టడీస్, సోషియల్ వర్క్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన విచ్చేసి మాట్లాడుతూ దేశ జనాభాలో యువత అధికంగా ఉండడం శుభపరిణామన్నారు. ఇది అభివృద్ధికి సూచికగా చెప్పవచ్చన్నారు. దీంతో పాటు జనాభా అధికంగా పెరగడం వల్ల అనర్థాలు అంతే స్థాయిలో ఉన్నాయని, ఆకలి చావులు అధికంగా నమోదవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ ప్రిన్సిపల్ జి.పద్మనాభం మాట్లాడుతూ జనాభా పెరుగుదలతో కలిగే నష్టాలు, ప్రయోజనాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు అతిథులు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పద్మావతి డిగ్రీ అండ్ పీజీ కళాశాల సోషియల్ వర్క్ హెడ్ సుజాతమ్మ, ఆంధ్రాబ్యాంక్ విశ్రాంత మేనేజర్ సుబ్రమణ్యం, సాయి సుజాత, సునీల్ కుమార్, రేనా, కోదండారెడ్డి, శివప్ప, పార్థసారథి, భాగ్యలక్ష్మీ, శ్రీహరి, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న అతిథులు

టీటీడీ ఆలయాలను ప్రక్షాళన చేయాలి



మాట్లాడుతున్న సాధు పరిషత్ ప్రతినిధి శ్రీనివాసానంద సరస్వతిస్వామి

- లేని పక్షంలో ఆమరణ దీక్షకు సిద్ధం
- సాదు పరిషత్ ప్రతినిధి శ్రీనివాసానంద సరస్వతి స్వామి డిమాండ్

తిరుపతి కల్చరల్: తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు అనుబంధ ఆలయాల్లో హిందూ మతం నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న వాటిపై చర్యలు తీసుకుని ప్రక్షాళన చేయాలని సాధు పరిషత్ ప్రతినిధి శ్రీనివాసానంద సరస్వతి స్వామి డిమాండ్ చేశారు. గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుమలలో మఠాల ముసుగులో జరుగుతున్న దోపిడీని అరికట్టి, మఠాల భవనాలను టీటీడీ స్వాధీనం చేసుకోవాలన్నారు. అలాగే టీటీడీ అనుబంధమైన శ్రీగోవిందరాజస్వామి ఆలయం ప్రధాన గోపురం మార్గం ఆక్రమణలకు గురైందని, గోవిందుని పుష్కరిణి మాదక ద్రవ్యాలకు కేంద్రంగా మారిందని ఆరోపించారు. పుష్కరిణిలో నీరు నింపలేని పరిస్థితిలో ఉండడం బాధాకరమన్నారు. టీటీడీ అనుబంధ ఆలయాల సమస్యలపై టీటీడీ ఈవో శ్యామలరావుకు తెలియజేశామని, ఈవో 15 రోజుల్లో పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారన్నారు. ఆ గడువుకు మించి సమస్యలు పరిష్కరించని పక్షంలో సాధుపరిషత్ ఆధ్వర్యంలో ఆమరణ దీక్షకు సిద్ధమవుతామని హెచ్చరించారు. సాధు పరిషత్ ప్రతినిధులు అట్టూరి నారాయణ, భైరవనంద, శ్రీనివాసనంద, శుభోదనంద, సాంబశివానంద, గణేష్ స్వామి, ఓంకార్ పాల్గొన్నారు.